

# ఆయింట్లో మనిషి

వసుంధర

"ఆ అమ్మాయి బాగుందికదూ?" అన్నాడు శాస్త్రి.

"కొంతకాలంనుంచి ఆ అమ్మాయే కాదు- ఏ అమ్మాయైనా బాగానే కనబడుతోంది నాకు-" అన్నాడు శర్మ.

"ఆ అమ్మాయి అందరమ్మాయిల్లా లేదు. పొడవాటి వాలుజడ. హంసలాంటి నడక. ఒక్కసారి ఇటు తిరిగి మొహం చూపిస్తే బాగుండును-" అన్నాడు శాస్త్రి.

"ఆమె నెమ్మదిగానే నడుస్తోంది కావాలంటే ముందుకు వెళ్ళి ముఖం చూడవచ్చునుకదా-" అన్నాడు శర్మ.

"మనం ముందుకు వెళ్ళినా ఆమెను

చేయడం మర్యాదకాదు'' అన్నాడు శాస్త్రి
"అవును- నేను మరిచేపోయాను. మనం మర్యాదస్తులంకదూ-" అన్నాడు శర్మ
"అందుకే ఇందాకట్నుంచి ఆమె వెనక్కి తిరుగు తుందేమోనని ఆశగా ఎదురు చూస్తూ మన స్పీడు తగ్గించాను. ఆమె ఎప్పటికీ వెనక్కి తిరగటం లేదు-''
"అయిడియా-" అన్నాడు శర్మ
"మంచిది చెప్పాలి-" అన్నాడు శాస్త్రి
"అర్థం చేసుకొనే శక్తి నీలో లోపిస్తే తప్ప- నేనెప్పుడూ మంచి అయిడియాలే ఇస్తాను-" అన్నాడు శర్మ
"ఈ విషయంమీద ప్రస్తుతం కామెంట్ చేయదల్చుకోలేదు ఎందుకంటే నాకు నీ అయిడియా వినాలనుంది-" అన్నాడు శాస్త్రి
"నేను ఆ అమ్మాయిని స్పీడుగా దాటించుకుని వెళ్ళిపోతాను నువ్వు మాత్రం ఆ అమ్మాయి వెనుకే, దగ్గరగా నెమ్మదిగా నడుస్తూండు. కాసేపాగి చప్పట్లు కొట్టు ఆమె వెనక్కి తిరుగు తుంది-"
"అప్పుడామె నా చెంప పగుల గొడు తుంది-"
"నువ్వు చప్పట్లుకొట్టింది నన్ను పిలవ డానికనిచెప్పు- ఈలోగా నేనూ వస్తాను'' అన్నాడు శర్మ,
శాస్త్రి శర్మను కౌగిలించుకున్నంత పని చేయగా శర్మ వారించి -"మనిద్దరిలో ఒకరు ఆడా, ఒకరు మగా అయుంటే ఎంత బాగుండేది! "అన్నాడు
"నేను ఆడదానిగా పుట్టటం నాకిష్టంలేదు నువ్వు ఆడదానిగా పుడితే -మహాను నేను మగాడిగా భరవాలేదు కానీ- ఆడదానిగా నీరూపం నేను భరించలేను" అన్నాడు శాస్త్రి,
"నువ్వా అమ్మాయిని చూడాలనుకుంటే- ఇప్పుడు నువ్వన్నమాటలు వెనక్కి తీసేసుకోవాలి సరిగ్గా మూడంకెల టైము ఒకటి... రెండు... "
"వెళ్ళు నాది పొరపాటు '' అన్నాడు శాస్త్రి
మిత్రులిద్దరూ అనుకున్న ప్రకారమే చేశారు అంతా అనుకున్నట్లే జరిగింది. ఆ అమ్మాయి వెనక్కి తిరగ్గానే శాస్త్రి షాక్ తిన్నట్లు ఉలిక్కి పడ్డాడు
ఆమె అతన్ని సమీపించి- "అరే- నువ్వు శాస్త్రివికదూ-" అంది హిందీ యాస తెలుగులో.
"అవునండి మీరు మీరు"అని ఆగి పోయాడు శాస్త్రి అప్పటికి శర్మవచ్చి అతన్ని చేరాడు ఆమెను చూసి అతనూ తెల్లబోయాడు
"ఓహో శర్మకూడ ఇక్కడే ఉన్నాడా" అన్నదామె,
"అవునండి నేనెముందు వెళుతూంటే అతన్ని పిలిచాను మీరు వెనక్కి తిరిగారు-" అన్నాడు శాస్త్రి
"అలాగా- నాకు బాగానే ఏమరయ్యారు మీరు నాతో రండి'' అన్నదామె ఉత్సాహంగా
శర్మ ఏదో అనబోయాడు. కానీ ఆమె అతణ్ణి మాట్లాడనీయకుండా- "చూడండి బాబులూ- మీకే పనులున్నాసరే అన్నీ మానుకొని నాతో రావలసిందే- అయినా మీరు ఏపనీ లేకుండా తిరుగు తుంటారని

నాకు తెలుసు-" అన్నది.

ఆమె పేరు నందిత. ఆమె ఉత్తరహిందూ స్థానీ వనిత. వయసు యాభై కిపైనే ఉంటుంది బయటకు పంజాబీడ్రస్సులో వచ్చిన మూలాన వెనుకనుంచీ చూసి మిత్రులిద్దరూ పొరబడ్డారు

కొన్నాళ్ళు వీళ్ళు ఆమెకు పక్క ఇంట్లో ఉండేవారు. ఆమె చురుకైనది, చొరవైనది ఆమెకు నలుగురు పిల్లలు ముగ్గురు మగ ఒకఆడ మగ పిల్లలు ఆమె మాట వినేవారు కాదు అందరికీ తెలుగు బాగా వచ్చును నందిత తన పనులను నోటి మంచితనంతో ఇతరులచేత చేయించుకునేది తరచుగా ఇంట్లోనే ఉండే శాస్త్రి, శర్మలను ఆమె అప్పుడప్పుడూ భోజనం పెట్టి మంచిచేసుకుంది. వాళ్ళచేత తన ఇంటిపనులు చాలా చేయించు కొనేదామె పట్టుకుంటే ఓ పట్టాన వదలదామె ఆమెకు భయపడే మిత్రులిద్దరూ ఇల్లుమారారు. ఇప్పుడు అనుకోకుండా ఇద్దరూ ఆమె పాలబడ్డారు.

"నీ మూలంగానే ఇదంతా" అన్నట్లు శర్మ శాస్త్రి వంక చూశాడు

"కాదు అసలిదంతానీ అయిడియా మూలంగా-" అన్నట్లు శర్మవంక శాస్త్రి చూశాడు

కానీ ఇద్దరూ కూడా కిక్కురుమనకుండా ఆమెను అనుసరిస్తున్నారు

నందిత తిన్నగా కూరల బజారుకెళ్ళింది ఇద్దరికీ చేరో సంచీ ఇచ్చింది. అవి చేతి సంచీలు అనడానికి వీల్లేదు గోనెసంచీల్లా ఉన్నాయి

"రిషాలో తిరిగి వద్దామనుకున్నాను ఆ అవసరం తప్పింది " అంది నందిత అంటే ఈ గోనెసంచీలు మోస్కుని ఆమె ఇంటిదాకా వెళ్ళాలి శాస్త్రికీ, శర్మకూ ప్రాణాలు పైనే పోయాయి. నందిత కాయగూరల బేరం మొదలు పెట్టిందంటే ఓ పట్టాన తెమలదు ప్రతి చోట భారీ ఎత్తున యుద్ధం చేస్తుంది. వంద గ్రాముల సరుకు కొనేటప్పుడే ఆమె గీసి గీసి బేరమాడుతుంది కేజీల లెక్కన అంటే ఇంక చెప్పనవసరం లేదు ఆమెతో పాటు ఇద్దరూ కూరల బజారులో ఓ దుకాణం నుంచి మరో దుకాణానికి తిరగాల్సి ఉంటుంది,

' రిషా వద్దనుకుంటే ఎలా? నీవు రిషాలోనే వెళ్ళాలి" అన్నాడు శాస్త్రి చాటుకున్న అతడి బుర్రలో ఏదో మెరిసింది


"వద్దు బాబులూ ఈ రోజుల్లో రిషా వాళ్ళను నమ్మడానికి వీల్లేకుండా ఉన్నది మొన్ననే ఓ రిషావాడు......"

"అవునండి... అది నేనూ విన్నాను. కానీ ఈ రిషావాడు అలాంటి వాడుకాదు. చాలా మంచివాడు"అన్నాడు శాస్త్రి ఆమె వాక్ప్రవాహానికి అడ్డుపడుతూ.

"ఈ రిషావాడంటున్నావు ఇక్కడేవరూ రిషావాడు లేడే " అన్నది నందిత ఆశ్చర్యంగా

"వాడిక్కడలేడండి బజార్లో ఉంటాడు. వాడిని మేము పోలీసుల బారి నుంచి తప్పించాము మా ఋణం తీర్చుకోవాలని ఊరికే సరదాపడిపోతున్నాడువాడు " అన్నాడు శాస్త్రి సమయానికి నోటికి వచ్చిన అబద్ధం చెబుతూ.

నందత మాట్లాడ లేదు అంతా కలిసి బజారు చేరుకున్నారు అక్కడ శాస్త్రి కాస్త దూరంగా ఉన్న ఓ రిషావాడి




దగ్గరకెళ్ళి "నీకు పదిహేను రూపాయలిస్తాను దూరంగా కనబడుతున్న ఆ అమ్మగారితో బజారంతా తిరిగి ఆ తర్వాత ఆవిణ్ణి కూరలతో ఇల్లు చేర్చాలి-" అన్నాడు

రిక్షావాడు వెంటనే - "బాబ్బాబు — ఆ అమ్మగారికి రిక్షా కట్టానని తెలిస్తే మా యూనియన్ వాళ్ళు నా ప్రాణాలు తీసేస్తారు—నన్ను ప్రలోభ పెట్టకండి—" అన్నాడు శాస్త్రి ఎంత చెప్పినా వాడు వినలేదు అక్కడేఉన్న మరో అయిదారుగురు రిక్షావాళ్ళను కూడా అడిగి చూశాడు. సందిత ఆ బజార్లో చాలా పలుకుబడి సంపాదించిందని శాస్త్రికి అర్థమయింది

అతను దిగులుగా సందితను సమీపించాడు

"ఏంచేసివచ్చావు? నీ వాటంచూస్తే రిక్షావాళ్ళను బేరమాడి వచ్చినట్లు కనబడుతోంది-" అన్నది సందిత

"అబ్బే-అదేంలేదు. నేను నా రిక్షావాడి గురించి వాకబుచేశాను ఏమయిందో వాడి జాడ ఎక్కడా లేదు"- అన్నాడు శాస్త్రి.

శర్మ ప్రశ్నార్థకంగా శాస్త్రి వంక చూశాడు తమ ఋణం తీర్చుకోవాలని సరదాపడిపోతున్న ఆ రిక్షావాడిని చూడాలని అతనూ సరదాపడ్డాడు శాస్త్రి వుద్దేశ్యమేమిటో అతడికి అంత బాగా అర్థంకాలేదు


సందిత వాళ్ళిద్దర్నీ బజారంతా తిప్పింది. రెండు గోనెసంచులూ నింపింది. ఒక సంచీ శాస్త్రికి, ఒక సంచీ శర్మకు! ఇద్దరూ వాటిని భుజాలమీదకు ఎక్కించారు ముందు సందిత . . ఆ వెనక వాళ్ళు. .

నీటుగా, దాబుగా ఉన్న ఓ ఇద్దరు యువకులు-భుజాలమీద కూరల బస్తాలు వేసుకుని—సందిత వెనక నడుస్తూంటే ఆ దృశ్యం చూడముచ్చటగా ఉంది శాస్త్రి, శర్మ మటుకు- తమ ముఖాలు ప్రజల

కళ్ళబడకుండా దాచుకున్నా. .
దారిలో ఎవరో నందితను పలకరించారు
"మీ అబ్బాయిలా?"
"మా అబ్బాయిలకింత బుద్ధికూడానూ... ఒకప్పుడు మా పొరుగున ఉండేవారు తెలివైనవాళ్లు మర్యాదస్తులు. ఏపనిచేయడానికీ నామోషీపడరు..." అంటూ నందిత శాస్త్రి, శర్మలను ఆకాశానికెత్తేసింది. కానీ భుజంమీద బరువు వాళ్ళను భూమిలోకి కృంగదీసేస్తోంది.
"అలాగా-ఓసారి మా ఇంటికి పంపిస్తారూ?" అన్నదామె.
"దేనికి?"
"మా యింటి కొట్టు గదిలో ఎలక చచ్చిన వాసన వస్తున్నది. వారం రోజుల్నించి పనిమనిషి రావడంలేదు ఇంట్లో ఎవ్వరూ ఆ గది శుభ్రంచేయడానికి ఒప్పుకోవడం లేదు. మగ పిల్లలకు నామోషీ – ఆడ పిల్లలకు అసహ్యం ఆయనకు చిరాకు, నాకు భయం-" అన్నదామె
"నీకేం భయంలేదు. వీళ్లు నేను గీచిన గీటు దాటరు. నేను పంపిస్తాను–" అన్నది నందిత.
అవతలామె పేరు కృష్ణవేణి. మనిషియాభైకి పైబడిన దానిలా ఉంది ఆమె ఎంతసేపూ ఆడపిల్లల పెళ్ళిళ్ళగురించే మాట్లాడుతోంది అందువల్ల ఆమె ఇంట్లో పడుచుపిల్లలున్నారని శాస్త్రి, శర్మలకు అనిపించింది. ఆమెతో వెళ్ళాలనే వాళ్ళు అనుకున్నారు.
కృష్ణవేణి నందితతోపాటు వచ్చి వాళ్ళను తన ఇంటికి తీసుకుని వెళ్ళింది. గుమ్మంలోనే ఆడపిల్లలిద్దరూ ఎదురయ్యారు వాళ్ళకు. ఒకమ్మాయికి ఎనిమిది, మరో అమ్మాయికి పది-ఏళ్లుంటాయి
"ఈ పిల్లల పెళ్ళిగురించేనా మీరుమాట్లాడింది?" అన్నాడు శాస్త్రి.
"అవును-నాకు ముందుచూపు ఎక్కువ.'' అన్నది కృష్ణవేణి.
"హతోస్మి-" అనుకున్నాడు శర్మ,
ఇద్దరూ కొట్టు గదిలోకి వెళ్ళారు వాసన భరించడం కష్టంగా ఉన్నది వాళ్ళకు అయినా భరించి గదిని శుభ్రం చేశారు అప్పుడు వాళ్ళకు దొరికింది ఒకమూల. చచ్చిన ఎలక, ఆ పక్కనే ఒక మనిషి చెయ్యి కూడా ఉన్నది!

ం ం ం

"మన కష్టానికి తగిన కూలి దొరికింది-కానీ ఈ చేతిని ఏం చేసుకుంటాం?" అన్నారు శర్మ.
"కృష్ణవేణి ఈ చేతిని చూసి హడలిపోయింది. తక్షణం ఇది పట్టుకుని ఇంట్లోంచి పొమ్మని వేడుకుంది. దీన్ని ఏం చేయాలి?" అన్నాడు శాస్త్రి.
"అసలీ చేయి వాళ్ళింట్లోకి ఎలా వచ్చిందో?" అన్నాడు శర్మ.
"హత్య!" అన్నారు శాస్త్రి.
''అంటే హంతకుడెవరు?"
శాస్త్రి ఆలోచిస్తూ-" అసలు హతుడెవరో ముందు తెలుసుకోవాలి!" అన్నాడు.
ఇద్దరూ పార్కులో ఓ మూల కూర్చున్నారు. అప్పుడు గుడ్డలో చుట్టబడ్డ ఆ చేతిని పరీక్షగా చూశారు. చేతిమీద పచ్చబొట్టు ఉన్నది. ఎవడో రాజు!
వాడిపేరు రాజు. ఆ పేరు స్పష్టంగా చేతిమీద ఉన్నది.
"ఆ చేయి ఎవరిది? ఆ ఇంట్లోకి ఎలా వచ్చింది?"




"ఈ ప్రశ్నలకు సమాధానం తెలుసుకుని ఏం చేస్తాం?" అన్నాడు శర్మ.

"అయిడియా!" అన్నాడు శాస్త్రి.

"ఏమిటది?"

"మనింటి కెదురుగా ఇద్దరమ్మాయిలున్నారు గుర్తుందా రమ, ఉమ!"

"ఊ"

"ఈ చేతిని వాళ్ళింట్లో పడేద్దాం-"

"అప్పుడు-?"

"ఏం జరుగుతుందో నువ్వే చూస్తావు!"

ఇద్దరూ ఇంటికి వెళ్ళారు. అదృష్టవశాత్తూ ఎదురింటికి తాళం పెట్టి ఉంది. శాస్త్రి, శర్మ ఆ ఇంటిచుట్టూ ప్రదక్షిణం చేశారు. బెడ్రూం కిటికీ తలుపు తీసి ఉంది. శాస్త్రి తన చేతిలోని చేతని కిటికీలోంచీ గిరవాటు పెట్టాడు.

ఇద్దరూ ఇంటికి వెళ్ళిపోయారు.

"ఏం జరుగుతుందంటావ్?" అన్నాడు శర్మ.

"ఆడపిల్లలిద్దరూ ఇంట్లోకి రానీ- అప్పుడేం జరుగుతుందో చూడు!"

"ఏం జరుగుతుందో ముందు నువ్వే చెప్పు. నీ ఊహాశక్తి ఎంత గొప్పదో నేను చెబుతాను-" అన్నాడు శర్మ.


"నా ఊహాశక్తి గొప్పతనానికి నీ సర్టిఫికెట్ అవసరం లేదు కానీ- ఇప్పుడు టైమెంతయింది?" అన్నాడు శాస్త్రి.

"వాచీ చూడకుండా ఊహించి చెబుతాను" అన్నాడు శర్మ. "అసలు నీకిప్పుడు టైమెందుక్కావలసొచ్చిందో చెప్పు-" అన్నాడు.

"ఆ ఉమ, రమలు- ఇప్పుడిప్పుడే ఇక్కడికి రారేమోనని అనుమానం కలిగింది నాకు-" అన్నాడు శాస్త్రి.

"ఎందుకని?"

"నువ్వు గమనించావో లేదో- ఈ మధ్య వాళ్ళు రోజూ రాత్రి ఎనిమిది దాకా ఇంటికి రావడం లేదు-" అన్నాడు శాస్త్రి.



"అంతవరకూ ఏం చేస్తున్నారు"

''సేల్స్ గరల్స్...''

''ఎక్కడ?''

"భారతీ క్లాత్‌హౌస్‌లో!"

శాస్త్రి నెమ్మదిగా- "ఆ చెయ్యి చూశారంటే పడుచులిద్దరూ మనింటికే పరుగున వస్తారు. రమ ఇక్కడే ఉండిపోతుంది. నువ్వూ ఉమా కలిసి వాళ్ళింటికి పోదురు గాని..." అన్నాడు

''నేను వెళ్ళను. నువ్వే వాళ్ళింటికి వెళ్ళు''

"ఏం?"

''ఆ యింట్లో ఓ ముసల్ది ఉంది-''

"వ్వాట్?" ఆశ్చర్యపడ్డాడు శాస్త్రి- ''నే నెప్పుడూ చూడలేదే!''

"ఆ యింటికేసి ఎప్పుడు చూసినా నాకా ముసల్దే కనబడుతుంది. అందుకే ఆ యింటికేసి చూడ్డం మానేశాను. నా అనుమానం నీకూ ఆ ముసల్దే కనబడుతోందని. ఇందాకా నందితను చూసి పడుచుపిల్ల అనుకున్నట్లు"

''ఏయ్ శాస్త్రీ! అనవసరంగా నా మీద అభాండాలు వేయకు. నందిత పడుచుపిల్ల అని వెనుకనుంచి చూసి ఇందాకా నాతో పాటు నువ్వూ పొరబడ్డావు. అవునా, కాదా?"

"అవన్నీ- ఇప్పుడెందుకు- రమ, ఉమ మనింటికి పరుగున వస్తే- ఉమ ఇక్కడే ఉండిపోతుంది. నువ్వూ, రమా కలిసి ఆ ఇంటికి వెళ్ళండి-''

"మరి ఆ ఇంటిలో ఓ ముసల్ది ఉందన్నావు..."

"అందుకే..."

"అవునూ- ఇప్పుడా ముసల్ది ఏమయిందంటావ్?" అన్నాడు ఉలిక్కిపడి.

"అవును... ఇల్లు తాళం వేసి ఉంది. ఆ ముసల్ది ఏమై ఉంటుంది?"

"ముసల్ది ఆరోగ్యంగా ఉందా?" అనడిగాడు శాస్త్రి

లేదు...'' అన్నాడు శర్మ. "ఆవిడ ఆరోగ్యంతో మనకేం పని.''
"ఆవిడ ఆరోగ్యవంతురాలు కాదనుకో- వాళ్ళావిడను ఇంట్లోనే వదిలి తాళంపెట్టి బయటకు వెడుతూ ఉండి ఉండవచ్చు."
శర్మ ఉలిక్కిపడి "అయితే మనం విసిరిన చెయ్యి ఆ ముసలావిడ కళ్ళబడిందేమో?'' అన్నాడు.
శాస్త్రి కూడా కంగారు పడ్డాడు. "అనుకున్న దొకటి...అయినది ఒకటి..."
"ఇప్పుడేం చేయాలి?.... ఆవిడ ఆచెయ్యి చూసి జడుసుకుని ఇంట్లోంచి బయట పడే దారిలేదు- గుండెలవిసిపోయి..."
శాస్త్రి చటుక్కున లేచి "తప్పు మనది... దాన్ని వెంటనే సరిదిద్దుకోవాలి..." అన్నాడు.
"ఏంచేద్దాం?"
"ఆ ముసలావిడ ప్రాణాలు రక్షించాలి"
మిత్రులిద్దరూ లేచారు. ఇంటి తలుపులు తీద్దామనుకోగా ఈలోగా ఎవరో తలుపు తట్టారు. శర్మ వెళ్ళి తలుపు తీసి హతాశుడై పోయాడు.

ఎదురుగా నందిత ఆ వెనుకనే కృష్ణవేణి ఇద్దరూ గదిలోపకు వచ్చేశారు
శర్మ ఏదో అనేలోగానే "ఆ చెయ్యేం చేశారు బాబూ!" అన్నది కృష్ణవేణి.
"అవతల పారేశాం-" అన్నాడు శాస్త్రి చిరాగ్గా.
"కొంపముంచేశారు'' అన్నది కృష్ణవేణి.
ఏదో అనబోయి ఆగిపోయాడు శాస్త్రి.
"ఆ చెయ్యి కావాలి— అర్జంటుగా—" అన్నది కృష్ణవేణి.
"ఆ చెయ్యి గురించి ఇప్పుడే తెలిసింది. ఇచ్చాడట. ఇంట్లో వాళ్ళెవరికీ చెప్పకుండా వారం రోజులు- చెప్పి మరో వారం రోజులూ అది ఇంట్లో ఉంచుకుంటే- మాకు శుభయోగం ప్రారంభమవుతుందట. ఆ విషయం నాకేం తెలుసూ! ఇప్పుడే ఆయన ఇంటికి వచ్చి ఈ విషయం చెప్పారు. నేను నందిత గారింటికి వచ్చి అక్కణ్ణించి మీ అడ్రసు తెలుసుకుని ఆవిణ్ణి కూడా వెంటబెట్టుకుని ఇలా వచ్చాను-'' అన్నది కృష్ణవేణి.
'మనిషి చెయ్యి ఆ సన్యాసికెలా వచ్చింది? హత్యచేసి ఉండాలి. హత్యచేసిన వాడు హంతకుడు... హంతకుడంటే నేరస్థుడు... నేరస్థుడిచ్చిన వస్తువు దాచారు మీరు...అది పెద్ద నేరం...''

శాస్త్రి ఇంకా ఏదో అనబోతుండగా-
"ఈ మాత్రం సందేహాలు నాకూ వచ్చాయి. ఆయన అన్నీ చెప్పారు. ఆ సన్యాసి హంతకుడు కాడు. ఆయన మా ఆయన కిచ్చింది మనిషి చెయ్యి కాదు. శవం చెయ్యి. అదే శవం కాలు ఒకటి పోలీస్ కమిష్నర్ గారికి కూడా మంత్రించి ఇచ్చాడట...'' అన్నది కృష్ణవేణి.
శాస్త్రికి ఇంక మాట రాలేదు. పోలీసులు కూడా తమకు మేలు జరుగడం కోసం మంత్రించిన శవాల మీద ఆధారపడితే ఇంక నేరాల నెవరాపగలరు?
"ఆ చెయ్యి పోయించండి-'' అన్నాడు శర్మ.
''ఎలా పోయింది? ఎక్కడ పోయింది!" అంది కృష్ణవేణి.
''ప్రశ్నలు తరవాత- మీరు చాలా బుద్ధిమంతులు. త్వరగా వెళ్ళి ఆ చెయ్యి

ఎక్కడ పాగేశారో అక్కణ్ణించి తీసుకు రండి-'' అంది నందిత.

"బాబూ- ఇప్పుడా చెయ్యికోసం నీకాళ్ళ పట్టుకోమన్నా పట్టుకుంటాను. మా ఆయన ఆ చెయ్యిలేకుండా ఇంటిలో అడుగుపెట్టొద్దన్నారు.-" అన్నది కృష్ణవేణి

అతడి జేబులో మారుతాళాల గుత్తి ఉన్నది. దానిని ఉపయోగించి ఇద్దరూ ఎదురింటిలో ప్రవేశించారు. తిన్నగా బెడ్రూంవైపు నడిచారు. అక్కడ గదిలోనికి తొంగిచూసి నివ్వెరపోయారు. బెడ్రూంలో మంచంమీద ఓముల్లిపడు కొని ఉన్నది. ఆమెపైన ఒక మొండి చేయి పడివున్నది. ముసలిదానిలో చలనంలేదు.

"చచ్చిపోయింది-" అన్నాడు శాస్త్రి. 'చచ్చిపోయిందా- మనం చంపేశామా?"

"అవన్నీ తర్వాత ఆలోచిద్దాం ముందా చెయ్యి తీసుకునివెళ్ళి కృష్ణవేణికి అందించాలి. ఈచెయ్యి చూసి జడుసుకుని ముసల్ది చనిపోయి ఉంటుంది" అన్నాడు శాస్త్రి.

○ ○ ○ ○ ○

"ముసల్ది వాళ్ళకేమవుతుందో?" అన్నాడు శర్మ.

"వాళ్ళు అనాధ శరణాలయం పక్షులు. ముసల్ది వాళ్ళకు చుట్టం కావడానికి వీల్లేదు" అన్నాడు శాస్త్రి.

"ఏది ఏమైనా ఆమెకూ వాళ్ళకూ ఏదో అనుబంధముండి తీరాలి. లేకుంటే వాళ్ళామెను తమతో ఉంచుకోరుకదా!" అన్నాడు శర్మ.

"నిష్కారణంగా మనవల్ల ఆ ముసల్ది చచ్చిపోయింది. వాళ్ళింటికిరాగానే ఆవిడకోసం ఎంత గోల చేస్తారో ఏమో?"


**రు. 25,000 బహుమతులు గెలవండి. ఎంట్రీ ఫీ లేదు! ఉచిత పోటీ**

| | | |
|---|---|---|
| 10 | 15 | 8 |
| 9 | 11 | 13 |
| 41 | 7 | 12 |

( మాదిరి మొత్తం : 33 )

మొదటి బహుమతి : రాజ్‌దూత్ మోటార్ సైకిల్, కలర్ టి. వి, లేక- 7000 రు. రొక్కం. (ఏదో ఒకటి)

కన్సొలేషన్ బహుమతి: 101 మిక్సర్ కమ్ గ్రైండర్ సగం ధరకే వ్యాపార అభివృద్ధి పథకంపై. ప్రమోటర్లదే తుది నిర్ణయం.

కాగితంపై 9 ఖాళీ గళ్లకు పై విధంగా గీయండి. 8 నుంచీ 16 వరకు అంకెలని వుపయోగిస్తూ, ఎటు కూడినా మొత్తం 36 రావాలి. ఒక అంకె ఒకసారే వుపయోగించాలి. మొదట చేరిన ఎంట్రీకి రిష్ట్ వాచీ బహుమతి. 15 రోజులలోగా ఎంట్రీలు చేరాలి.

**NEWYORK TRADERS (721) Post Box No. 5382, Delhi-110053.**

అన్నాడు శాస్త్రి.

"ముందు వాళ్ళ రియాక్షన్ చూద్దాం. దాన్నిబట్టి మనం వాళ్ళకెలా సాయ పడాలో నిర్ణయించుకుందాం" అన్నాడు శాస్త్రి. మిత్రులిద్దరూ ఎదురింటివేపే చూస్తూ కూర్చున్నారు. రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో రమ, ఉమ ఇంటికి వచ్చారు. తలుపు తాళం తీసుకుని వెళ్ళారు.

"సరిగ్గా అయిదునిముషాల్లో వాళ్ళు కంగారుగా బయటకు వస్తారు" అన్నాడు శర్మ.

"అయిదు కాదు ఆరు..." అన్నాడు శాస్త్రి.

"ఎందుకని?"

"నువ్వు అయిదని ఎలా చెప్పగలిగావు అలాగే ఆరు అన్నాను నేను..."

"సరే చూద్దాం ఎవరి ఊహ నిజమౌతుందో!"

టైము సరిగ్గా ఆరు నిముషాలు కాగానే శాస్త్రి తలెత్తి చూశాడు. అప్పటికీ ఎదురింటి తలుపులు తెరుచుకోలేదు.

"వెధవ్వాచీలు..." అన్నాడు శర్మ.

"అటు చూడు..." అన్నాడు శాస్త్రి. శర్మ అటు చూశాడు. సరిగ్గా అప్పుడే ఎదురింటి కిటికీ తలుపులు మూసుకున్నాయి.

"అరే- ఆశ్చర్యం... ఆ ఆడపిల్లలింకా పడకగదికి వెళ్ళ లేదా- ఎంత ధైర్యంగా తలుపులు వేసేసుకుంటున్నారు?" అన్నాడు శాస్త్రి.

"ఛీ- నేను ఆశ్చర్యపడింది అందుకు కాదు" అన్నాడు శర్మ.

"మరి-?"

"ఆ కిటికీ తలుపులు వేసిందెవరో నువ్వు చూడలేదా"

"లేదు-"

"ఆ ముసల్ది..."

శాస్త్రి, కెవ్వుమన్నాడు. అతడు తమాయించుకున్నాక శర్మ నెమ్మదిగా- "నేను, ఉమ ఇక్కడే ఉండిపోతాం. నువ్వు రమతో కలిసి వాళ్ళింటికి వెళ్ళు-" అన్నాడు.

"ఇప్పుడు నువ్వు శృంగారం గురించి ఆలోచిస్తున్నావా?"


"అది కాదు- మంచంమీద ముసల్ది నిజంగానే చచ్చిపడుంది. అందులో ఏమీ సందేహం లేదు-"

తక్షణం వెళ్ళి నిజం తేల్చుకుని రావాలని ఇద్దరు అనుకున్నారు. అనుకున్నదే తడవుగా ముందుకు వెళ్ళి ఎదురింటి తలుపు తట్టారు.

"ఎవరూ?" అన్నది ఓ కంఠం.

"నేను శాస్త్రిని..." అన్నాడు శాస్త్రి. కొద్ది క్షణాల్లో తలుపులు తెరుచుకున్నాయి రమ చిరాగ్గా వాళ్ళిద్దరి వంకా చూసి- "ఇలా రాత్రివేళ ఆడపిల్లల ఇంటి తలుపులు తడితే- ఇరుగూ పొరుగూ ఏమనుకుంటారు?" అన్నది.

"ఈ ఇంట్లో ఓ ముసల్ది ఉన్నదని శర్మ అంటాడు శవం ఉందని నేనంటాను. నిజం తేల్చుకోవడం కోసం ఈ యింట్లోకి వచ్చాం. మేము రావడం ఎవరు చూడలేదు..." అన్నాడు శాస్త్రి. ఆ మాటలు వింటూనే రమ తలుపులు వేసి- "శవం ఉన్నదని ఎవరు చెప్పారు. మీరు చూశారా?" అన్నది ఇద్దర్నీ ఉద్దేశించి.



"నేను చూశాను. పరీక్షించాను ..." అంటూ శాస్త్రి జరిగింది క్లుప్తంగా చెప్పాడు.

"అయిపోయింది. అంతా అయిపోయింది..." అంది రమ వెంటనే ఏడుపు కంఠంతో.

"ఏమయింది?" అన్నాడు శర్మ కంగారుగా.

"ఆ శవం గురించి ఎవరికీ తెలియకూడదనుకున్నాం, మొదటి రోజునే మీరు పట్టేశారు. ఇంక మాకు అదృష్టం లేదు..." అన్నది రమ దిగులుగా.

ఆ శవాన్ని వాళ్ళకు ఓ సన్యాసి ఇచ్చాడట. అది మంత్రించబడ్డ శవమట. వారం రోజులు ఉంచుకుంటే వాళ్ళ జాతకాలు మారిపోతాయట. కానీ ఇంట్లో శవం ఉన్నట్లు వాళ్ళకు తప్ప ఇంకెవ్వరికీ తెలియకూడదట.

"తెలియకుండా ఎలా ఉంటుంది? శవం వాసన వేయదూ?" అన్నాడు శర్మ.

మళ్ళీ ముసల్ది ఎలా వచ్చింది. "శర్మ పొరపాటుపడి ఉండాలి..." అంటూ అప్పుడే అక్కడికి ఓ ముసల్ది ప్రవేశించింది.

"సన్యాసి దానికేవో పసరులు పూశాడు. వాసన వేయదట. దీనికి మేము వెయ్యి రూపాయలు చెల్లించాం. అతిరహస్యంగా నిన్న ఓ రాత్రివేళ ఆయన ఇది మా ఇంటికి చేర్చాడు ..." అన్నది రమ.

"మరైతే నీ యింట్లోని ఆ ముసల్ది ఎవరూ? మేము ఇంట్లో శవం చూశాము. అప్పుడు ఇంకెవ్వరూ లేరు. ఆ తర్వాత మీరిద్దరూ లోపలకు అడుగు పెట్టారు."

మిత్రులిద్దరూ ఆమెవంక ఆశ్చర్యంగా చూస్తుండగా— ఆమె తల మీదవిగ్గునూ, ముఖానికున్న మాస్కునూ తొలిగించి ఉమగా మారిపోయింది.

"ఇద్దరం ఆడ పిల్లలం. అందుకని ఈ ఇంట్లోఓముసల్ది ఉన్న భావం కలిగించడం కోసం నేను వీధివైపు వచ్చేటప్పుడు ఇలా కనబడుతూ ఉంటాను. అందుకే మా జోలికి ఎవరూ రావడంలేదు...."

అన్నది ఉమ.

"అయితే ఒక ఉపాయం" అన్నాడు శాస్త్రి. తను రమవైపు నడుస్తూ "శవం ఇంటిలో ఉన్నట్లు మీ ఇద్దరికి తెలుసు. మేమూ మీవాళ్ళమైతే మనమంతా ఒక్కటే కదా- అందుకని ఈ వారం రోజులూ మనం కలసిమెలిసి ఏకకుటుంబంగా జీవిద్దాం. ఆ విధంగా మీకూ మాకూ ప్రయోజనం సిద్ధిస్తుంది-"

"ఈ వారం రోజులూ కుదరదే- కనీసం మనం నెల రోజులైనా ఆగాల్సుంటుంది రిజిస్ట్రాఫీసులో పెళ్ళి చేసుకోవాలంటే! లేదా గుళ్ళో పెళ్ళితో సరిపెట్టుకుందామన్నా లగ్గ సరి రోజులు- కనీసం రెండు వారాలు ఆగాలి..." అన్నది ఉమ వెంటనే.

శాస్త్రి కోపంగా- "చరిత్రలేని మీ వంటి వాళ్ళు కూడా పెళ్ళిళ్ళ గురించి మాట్లాడితే మా బోటి బ్రహ్మచారులేమైపోవాలి?" అన్నాడు.

"చరిత్ర గురించి మాట్లాడేరంటే మిమ్మల్నిద్దర్నీ చరిత్రలోకి పంపించేసి- మీ శవాన్ని ఆ సన్యాసికి అమ్మేసి చెరో వెయ్యి సంపాదించుకుంటాం-" అన్నది రమ కోపంగా.

"మీరు చెప్పిన సన్యాసి దగ్గరకే నేనూ వెళ్ళాను. ఆయన నాకో శవం వేలు ఇచ్చి జేబులో ఉంచుకుని తిరిగితే- ఆడపిల్లలు దాసోహం అంటారని చెప్పాడు. అందులోని నిజం పరీక్షించాను. అంతా అబద్ధమని ఇప్పుడే తేలిపోయింది. నా మాట విని మీరు మీ ఇంట్లో శవాన్ని వదుల్చుకోండి" అన్నాడు శాస్త్రి.

"అంటే నువ్వూ నాకులాగే చెప్పకుండా ఆ సన్యాసి వద్దకు వెళ్ళి మంత్రించి వేలు తెచ్చుకున్నావన్నమాట-" అన్నాడు శర్మ తన జేబులోంచి వేలుతీస్తూ.

మిత్రులిద్దరూ ఆశ్చర్యంగా ఒకరినొకరు చూసుకుని-" ఇక మీదట మన మధ్య రహస్యాలుండనే కూడదు-" అనుకున్నారు. వాళ్ళిద్దరూ వెళ్ళబోతూంటే- "ప్లీజ్-ఆ శవాన్నెలా వదుల్చుకోవాలో చెప్పరూ?" అన్నారు ఆడపిల్లలిద్దరూ.

ఆ శవం సగౌరవంగా స్మశానంలో తగులబెట్టబడింది. ఆ యింట్లో ఓ ముసల్ది ఉంటున్న విషయం చాలా మందికి తెలుసు అంతా ముసల్దే పోయిందనుకున్నారు.

అటుపైన రమ ఉమల ఇంటిలో ఏ ముసల్దీ కనబడలేదు. అయినా అవసరం లేదు శాస్త్రి, శర్మ ఆడపిల్లల్ని అర్థం చేసుకొందుకు ప్రయత్నిస్తూ ప్రస్తుతానికి వాళ్ళకు తిరుగులేని అంగరక్షకులుగా ఉంటున్నారు.

Edited & Published by V. Leelavathy Raghavaiah at 1-8-519/11 Chikkadapalli, Hyd-20. & Printed by P. Ramakrishna at Ragha[v] Printers 1-8-4/1/1, Chikkadapalli, Hyderabad-20.